క్లుప్తంగా

నూతన కార్యవర్గానికి అభినందన



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: పోస్టల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులకు శుక్రవారం హెడ్ పోస్టాఫీస్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గేదెల సువర్ణ రాజు, ప్రధాన కార్యదర్శి సాధనాల శ్రీనివాస రావు, కోశాధికారి టి.రాజును సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ నాయకులు తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి మాట్లాడుతూ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి నూతన కార్యవర్గం పాటుపడాలని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధనకు కృషి చేయాలని కోరారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యం



నగరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా నగరంలో పూర్తిస్థాయి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 25వ డివిజన్‌లో శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటూ వార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజమహేంద్రవరాన్ని ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ కార్యాచరణతో మెరుగైన పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ ప్రాంతంలో పారిశుధ్యం, పరిశుభ్రత, తాగునీరు, వీధి దీపాలు, కుళాయిలు, అంతర్గత రహదారులు, కల్వర్టులు తదితర సమస్యలు ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సత్యదేవ నర్సరీ సందర్శన



కరీంనగర్ ఎమ్మెల్యే కమలాకర్‌కు స్వాగతం పలుకుతున్న చంటియ్య

కడియం: తెలంగాణలోని కరీంనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ శుక్రవారం కడియపులంకలోని పుల్లా చంటియ్యకు చెందిన శ్రీసత్యదేవ నర్సరీని సందర్శించారు. ఆయనకు చంటియ్య ఘన స్వాగతం పలికి వివిధ రకాల మొక్కలను వివరించారు. కడియం ప్రాంత నర్సరీల్లో వేలాది రకాల మొక్కలను అభివృద్ధి చేయడంపై నర్సరీ రైతులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ, ఆర్.సుబ్బరాజు, ఆర్.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



జేగురుపాడులో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న సర్పంచ్ సతీష్‌చంద్ర స్టాలిన్

కడియం: ప్రభుత్వం సమకూర్చిన స్టూడెంట్ కిట్లను జేగురుపాడు హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఆ గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, హెచ్ఎం సురేష్, ఎస్ఎంసీ చైర్మన్ కేశనపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి వీర శివాజీ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో కొలువైన శ్రీదేవి కనకదుర్గ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా మండల కేంద్రమైన రంగంపేట మంచినీటి చెరువు వద్ద ఉన్న విజయ దుర్గాంబిక ఆలయంలో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నగరంలో క్రీడోత్సవం

- టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం
- తరలివచ్చిన క్రీడాకారులు
- మూడు రోజుల పాటు నిర్వహణ



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు భాస్కర రామ్

ప్రకాశం నగర్: క్రీడలపై యువతకు ఆసక్తి పెరుగుతోంది. దానికి పోత్సాహం కూడా తోడవడంతో అనేక మంది ఆటలపై ఆసక్తి చూపుతున్నారు. చదువులో పాటు క్రీడలపై మక్కువ చూపుతున్నారు. దీంతో తరచుగా అనేక చోట్ల టోర్నమెంట్లు జరుగుతున్నాయి. ముఖ్యంగా నగరం క్రీడాపోటీలకు వేదికవుతోంది. ఇక్కడి చిన్నారులు, యువత ఆటలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో కూడా రాణిస్తున్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రస్తుతం నగరం టేబుల్ టెన్నిస్ పోటీలకు వేదికైంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులతో సందడిగా మారింది. స్థానిక నారాయణపురంలోని ఆర్ఎంసీ సిటీ బ్యాడ్మింటన్ కోర్టులో శుక్రవారం ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సుమారు మూడు రోజుల పాటు వీటిని నిర్వహించనున్నారు. పది టేబుళ్లపై 25 మంది అంపైరింగ్ సిబ్బందితో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు సుమారు 12 విభాగాలలో తలపడనున్నారు. మొదటి రోజు అండర్ - 17 బాలురు, బాలికలు, అండర్ -19 పురుషులు, స్త్రీల విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీలను జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విశ్వనాథం భాస్కర్ రామ్, ఉపాధ్యక్షుడు విజయ్ ప్రకాశ్ ఈ పోటీలను ప్రారంభించారు.

జాతీయ పోటీలకు ఎంపిక

ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో సుమారు వివిధ విభాగాల్లో పాల్గొన్న క్రీడాకారులకు వారు సాధించిన పాయింట్ల ఆధారంగా వారికి ర్యాంకింగ్ ఇచ్చి ఆయా విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. విజేతలకు నగదు బహుమతితో పాటు పతకాలు అందించనున్నారు. శుక్రవారం ప్రారంభమైన సీనియర్ విభాగాలకు శనివారం సాయంత్రం బహుమతులు అందజేయనున్నారు. విజేతలు నగదు బహుమతి పాటు, పతకాలను అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.



టేబుల్ టెన్నిస్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ప్రతిష్టాత్మకంగా పోటీలు

ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీలను రెండోసారి రాజమహేంద్రవరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు ఈ పోటీలో తలపడుతున్నారు. మూడు రోజులు జరిగే పోటీలు జరగనున్నాయి. పోటీల నిర్వహణ, విజేతల ఎంపికలు పారదర్శంగా నిర్వహిస్తున్నాం. క్రీడాకారులు ఇలాంటి టోర్నమెంట్లను సద్వినియోగం చేసుకోవాలి.

– విశ్వనాథం భాస్కరరామ్,
జిల్లా టీటీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు

పాత పింఛన్ విధానం కొనసాగించాలి



రైల్వేస్టేషన్ ఆవరణలో ధర్నా చేస్తున్న మజ్దూర్ నాయకులు, కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ: నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానం కొనసాగించే వరకూ నిరంతర పోరాటం చేస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ డివిజన్ సెక్రటరీ కె.విజయ కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆవరణలో రాజమహేంద్రవరం సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ శాఖల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సెక్రటరీ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం రద్దు చేసే వరకూ పోరాటం ఆగదన్నారు. కేంద్రం ప్రభుత్వం దిగిరాక పోతే జాయింట్ ఫోరం రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ నిరవధిక సమ్మె చేస్తామన్నారు. ఆందోళనలో ఇంజినీరింగ్, మెకానికల్ బ్రాంచ్‌ల సెక్రటరీలు, చైర్మన్లు, కార్మికులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్త ఈజే కోరే సేవలు అభినందనీయం

కంబాలచెరువు: ప్రపంచ ప్రఖ్యాత రసాయన శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఇలియాస్ జేమ్స్ కోరె (ఈజే కోరే) అందించిన సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఈజే కోరే 97వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రసాయన శాస్త్రం ఇన్‌చార్జి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో వినూత్నమైన పరిశోధన పద్ధతులు, వందలాది కొత్త సమ్మేళనాల సంశ్లేషణ ఆవిష్కరణలకు కోరే కృషి చేశారన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామకృష్ణారావు మాట్లాడుతూ కోరే 27 ఏళ్లకే విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా నియమితులయ్యారన్నారు. తర్వాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఆర్గానిక్ కెమిస్ట్రీలో వందల నూతన ఆవిష్కరణలు చేశారన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు బి.వెంకట్రావు, కె.వెంకట్రావు, డాక్టర్ నరసింహమూర్తి డాక్టర్ బేబీ నిర్మల పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

రాజానగరం: విద్యార్థి దశలో అలవర్చుకున్న క్రమశిక్షణ జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళుతుందని జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి అన్నారు. నామవరంలోని భారతీయ విద్యాభవన్‌ను ఆయన శుక్రవారం సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణను అలవర్చుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

బిక్కవోలు: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ అన్నారు. కొంకుదురు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కిట్లను సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలోని మాజీ సర్పంచ్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలాగే కొంకుదురు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందజేశారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల టీడీపీ నాయకుడు పల్లె శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ గొర్రెల త్రిమూర్తులు, చౌదరి తదితరులు పంపిణీ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు నిరంతర కృషి



వాక్‌థాన్ నిర్వహిస్తున్న ఓఎన్‌జీసీ ఉద్యోగులు

- ఓఎన్‌జీసీ అసెట్ మేనేజర్ శాంతానుదాస్
- ఉత్సాహంగా వాక్‌థాన్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఓఎన్‌జీసీ నిరంతరం కృషి చేస్తోందని రాజమహేంద్రవరం ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ శాంతానుదాస్ అన్నారు. స్వచ్ఛత పఖ్వాడా 2024 క్యాంపెయిన్‌లో భాగంగా పరిశుభ్రత, వ్యర్థాలను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం కంబాలచెరువు నుంచి పుష్కరఘాట్ వరకూ వాక్‌థాన్ నిర్వహించారు. దీనిని శాంతానుదాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఓఎన్‌జీసీ, ఎస్‌పీఎఫ్ ఉద్యోగులు, ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

శాంతానుదాస్ మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమం ఈ నెల 15వ తేదీతో ముగుస్తుందన్నారు. రెండు వారాల ప్రచారంలో భాగంగా వ్యర్థాల విభజన, సైట్లు, కార్యాచరణ ప్రాంతాలలో పరిశుభ్రత డ్రైవ్‌లపై వర్క్‌షాప్‌లతో సహా అనేక కార్యకలాపాలు నిర్వహించామన్నారు. వ్యర్థాల ముప్పు గురించి యువతకు అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో క్విజ్, పోస్టర్ల తయారీ, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రజలను చైతన్యం చేయడానికి వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు. సీఎస్ఆర్ విభాగం ద్వారా రెండు వారాల పాటు ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు, స్థానిక నివాసితులకు పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ ఏడాది వేస్ట్ టు వెల్త్ అనే థీమ్‌తో రాజమండ్రి అసెట్ తన ఆపరేషన్ ప్రాంతాల చుట్టూ పరిశుభ్రత, మూలం వద్ద వ్యర్థాల విభజనను ప్రోత్సహించడానికి వివిధ కార్యకలాపాలను నిర్వహించిందన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, కొత్తగా లైన్లు వేసే పనుల నేపథ్యంలో శనివారం నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ మెయిన్ రోడ్డు, టౌన్ హాల్ రోడ్డు, టి.నగర్, అజ్జరపువారి వీధి, ఇస్కాన్ టెంపుల్, గోదావరి బండ్, కోటిపల్లి బస్టాండ్, మున్సిపల్ కాలనీ ఏరియా, కోరుకొండ రోడ్ రాజా థియేటర్ ఏరియా, పేపర్ మిల్ క్వార్టర్స్ ఏరియా, మల్లయ్య పేట, వీఎల్ పురం, ఆదర్శ్ హాస్పిటల్ రోడ్, తిలక్ రోడ్, ఏవీ అప్పారావు వీధి, మార్గాని ఎస్టేట్ రోడ్, మోరంపూడి, కోనేరుపేట, ఆల్ బ్యాంక్ కాలనీ, శ్రీనగర్, గాదాలమ్మ నగర్, వెంకటగిరి, హుకుంపేట, శాటిలైట్ సిటీ మైన్ రోడ్, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీ, పిల్లి సుబ్రహ్మణ్యం తోట, బుచ్చయ్య నగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కృష్ణానగర్, కోర్లమ్మపేట, రామచంద్రరావు పేట, దేవీచౌక్ సెంటర్, హైటెక్ బస్టాండ్ ఏరియా, జాంపేట, తుమ్మలోవ ప్రాంతాలలో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ రామాలయం సెంటర్, తిలక్ రోడ్డు, ఎస్‌వీజీ మార్కెట్, వీఎల్ పురం, రహమత్ నగర్, తొర్రేడు, టిడ్కో ఏరియా, వెంకట్ నగరం గ్రామాలలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ హౌసింగ్ బోర్డ్ ఏరియా, స్పిన్నింగ్ మిల్ కాలనీ, ఆటోనగర్, రామచంద్ర కాలనీ, లాలాచెరువు, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ పరిధిలో సరఫరా ఆగిపోతుంది.
- ఉదయం 7 నుంచి 11 వరకూ ధవళేశ్వరం, అగ్రహారం, క్వారీ కెనాల్ రోడ్, శేఖర్ థియేటర్ రోడ్డు, కొత్తపేట ఎర్రకొండ, బత్తిన సుబ్బారావు కాలనీ, ఇండస్ట్రియల్ కాలనీ, ఎనోసాల్ట్ కంపెనీ, మంతెన సత్యనారాయణ ఆశ్రమం, నేషనల్ హైవే రోడ్డు ప్రాంతాల్లో ప్రభావం ఉంటుంది.
- **కడియం:** వేమగిరి సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వేమగిరి, కడియం, జేగురుపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న కడియం హైస్కూల్ విద్యార్థులు

కడియం: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని కడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కోఆర్డినేటర్ వై.ప్రకాష్ కుమార్ ఆధ్వర్యంలో ఆ పాఠశాలలో శుక్రవారం జూనియర్ రెడ్ క్రాస్ శిక్షణ జరిగింది. కార్యక్రమానికి హెచ్ఎం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ అనునిత్యం మనం ఎన్నో ప్రమాదాలు చూస్తుంటామని, అలాంటి సమయాల్లో బాధితులకు ప్రథమ చికిత్స చేసి, వారి ప్రాణాలను కాపాడాలన్నారు. ప్రథమ చికిత్స చేసే విధానంపై అవగాహన కల్పించారు. పాఠశాల నోడల్ ఆఫీసర్ గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. టీచర్ బి.సువర్ణవేణి మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు.

చెరువు భూమి కబ్జాకు రంగం సిద్ధం!

- రంగంపేటలో ప్రభుత్వ భూమికి రెక్కలు
- 90 సెంట్ల ప్రభుత్వ భూమి కాజేసేందుకు యత్నాలు

రంగంపేట: చెరువు భూమిని మింగడానికి తిమింగలాలు సిద్ధమయ్యాయి. ప్రభుత్వం మారడంతోనే భూములపై భూరాబంధులు వాలిపోతున్నాయి. మండల కేంద్రమైన రంగంపేటలో స్థానిక పద్దరాజు చెరువుకు చెందిన సర్వే నంబరు 506లో 90 సెంట్ల భూమి కబ్జాకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం మారిన వెంటనే రంగంపేటలో భూరాబంధులు తిరిగి తెరపైకి వచ్చాయి. ప్రభుత్వ భూమి కాజేసేందుకు గతంలో చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో తిరిగి కొత్త ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ప్రభుత్వ భూమికి రెక్కలు రావడం ఖాయమని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి గ్రామానికి చెందిన ఇద్దరు నాయకులు ఇప్పటికే తమ పనులు ప్రారంభించారు. ముందుగా వ్యవసాయం పేరుతో భూమిని సదును చేయడంతో గుసగుసలకు ఆజ్యం పోస్తుంది. ప్రభుత్వ రికార్డుల ప్రకారం గ్రామానికి చెందిన 506 సర్వే నంబరులో పద్దరాజు చెరువుకు చెందిన 5.87 ఎకరాల్లోని 90 సెంట్లు భూమిని ఇప్పటికే కబ్జాదారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీనిని పూర్తిగా ఆక్రమించి ప్లాట్లగా విభజించి అమ్మకాలు జరిపేందుకు వ్యూహరచన కూడా చేశారు. దీనికి అధికారులతో పాటు, అధికార పార్టీ నేతల అండదండల కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే ఈ భూమిని భూ కబ్జాదారులకు దక్కకుండా ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడేలా చూడాలని, ప్రభుత్వ పరంగా కాకపోయినా న్యాయ స్థానాన్ని ఆశ్రయించైనా ఈ భూమిని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

విద్యార్థులకు పదో తరగతి కీలకం



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట: ప్రతి విద్యార్థికీ పదో తరగతి కీలకమని ఈ దశలో రాణించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. శుక్రవారం మర్రిపూడి గ్రామంలోని పుట్టా శ్రీనివాస్ స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పుట్టా సోమన్న చౌదరి, గ్రామ పెద్దలు మోదుకూరి సత్తిరాజు, దువ్వ సూరిబాబు, పల్లె ప్రభాకర్, కందుకూరి శ్రీను, పుట్టా వెంకటేష్ పాల్గొన్నారు.

మణిశర్మ దంపతులకు సన్మానం



మణిశర్మ దంపతులను సన్మానిస్తున్న చైతన్యరాజు

రాజానగరం: ఎన్నో సినిమా పాటలకు అద్భుతమైన సంగీతాన్ని అందించిన మణిశర్మ అందరికీ సుపరిచితులేనని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) అన్నారు. గైట్ కళాశాలలో గురువారం రాత్రి మణిశర్మ దంపతులను చైతన్యరాజు దంపతులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

గాడాల హైస్కూల్‌కు సామగ్రి వితరణ



జోస్ అలుక్కాస్ మేనేజర్ జియోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జోస్ అలుక్కాస్ మేనేజర్ జియో శుక్రవారం రూ.60 వేలు విలువైన సామగ్రిని వితరణ చేశారు. విద్యార్థుల కోసం రెండు కంప్యూటర్లు, 15 కుర్చీలు, 15 టేబుళ్లు, ఆట వస్తువులను స్కూల్ హెచ్ఎం నిర్మలా జ్యోతికి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ జోస్ అలుక్కాస్ సంస్థ మేనేజర్ జియో ప్రభుత్వ పాఠశాలలకు వితరణ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారని అభినందించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

భారీ వర్షం.. జలమయం





రాజమహేంద్రవరంలో వానలో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు



బుర్రిలంక వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

కడియం: కడియపులంక పంచాయతీలోని బుర్రిలంక వద్ద జాతీయ రహదారి జలమయమైంది. శుక్రవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి సుమారు అర కిలోమీటరు మేర మేర నీటితో నిండిపోయింది. దీంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. రావులపాలెం వైపు నుంచి వేమగిరి వైపు వచ్చే రోడ్డు ఏ మాత్రం వర్షం కురిసినా ముంపు బారిన పడుతోంది. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నప్పటికీ శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. కుండపోత వానతో పలుచోట్ల రోడ్లు ముంపుబారిన పడ్డాయి. అలాగే ఉదయం ఓ మోస్తరు జల్లులు పడ్డాయి.